క్లుప్తంగా

శివరాత్రి నాటికి సీసీ రోడ్డు నిర్మిస్తాం



రోడ్డు నిర్మాణానికి కొలతలను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌

హయత్‌నగర్‌: వచ్చే శివరాత్రి నాటికి భక్తులకు సౌకర్యంగా ఉండేందుకు హయత్‌నగర్‌లోని పాత శివాలయం వద్ద సీసీ రోడ్డు నిర్మిస్తామని కార్పొరేటర్‌ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం నేతాజీ కాలనీ నుంచి శివాలయం మీదుగా అన్మగల్‌ బస్తీ వరకు ఉన్న రోడ్డును ఆయన పరిశీలించారు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో వెంటనే డీఈ దామోదర్‌, ఏఈ నరేంద్రతేజలను పిలిపించి రోడ్డు నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. స్పందించిన అధికారులు రోడ్డు కొలతలు తీసుకున్నారు. వెంటనే నిధులు తీసుకొచ్చి పనులు ప్రారంభిస్తామని కార్పొరేటర్‌ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గంగని శ్రీనివాస్‌, ఎర్రవెల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్యాస్‌ వినియోగంపై అవగాహన



నాగోలు: గ్యాస్‌ వినియోగించడంపై ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని గురుదత్త గ్యాస్‌ ఏజెన్సీ (ఇండేన్‌ గ్యాస్‌) నిర్వాహకుడు పిపీ కిరణ్‌ అన్నారు. కొత్తపేట డివిజన్‌ మోహన్‌నగర్‌ ప్రజయ్‌ నివాస్‌ అపార్ట్‌మెంట్‌లో గురుదత్త గ్యాస్‌ సర్వీస్‌ ఆధ్వర్యంలో గ్యాస్‌ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కిరణ్‌ మాట్లాడుతూ.. రైన పద్ధతిలో గ్యాస్‌ వాడుకోవడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. గ్యాస్‌ వాసన వస్తున్నట్లు అనుమానం వస్తే 1906 టోల్‌ ఫ్రీ నంబర్‌కు లేదా గ్యాస్‌ సర్వీస్‌ ఆఫీస్‌కు కాల్‌ చేయాలని సూచించారు.

రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారానికి కృషి చేస్తా



కార్మికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్‌

హస్తినాపురం: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సహకారంతో దాతునగర్‌ కాలనీలో రిజిస్ట్రేషన్ల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హస్తినాపురం కార్పొరేటర్‌ బానోతు సుజాతానాయక్‌ అన్నారు. బుధవారం డివిజన్‌ పరిధిలోని దాతునగర్‌ కాలనీలో సుజాతానాయక్‌ పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దాతునగర్‌ కాలనీలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని, వారి భాగస్వామ్యంతోనే పనులు త్వరితగతిన పూర్తవుతాయని ఆమె అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రేపాక ప్రభాకర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు సుదర్శన్‌రెడ్డి, శ్రీధర్‌రావు, రాజేందర్‌, రవీందర్‌గౌడ్‌, శశి, నవీన్‌యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

చెత్త తరలించేందుకు ఒప్పందం



కార్మికులతో చైర్‌పర్సన్‌ అనితానాయక్‌

చాదర్‌ఘాట్‌: ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌ చెత్త సమస్య బుధవారం పరిష్కారం అయినట్టు హైదరాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌ చైర్‌పర్సన్‌ అనితానాయక్‌ తెలిపారు. జీహెచ్‌ఎంసీకి నెలకు రూ.3లక్షలు చెల్లించేలా ఒప్పందం కుదిరిందని, మార్కెట్‌ ప్రాంగణంలోని 42 ఎకరాల్లో చెత్త లిఫ్టింగ్‌ చేసే ఒప్పందం చేసుకున్నట్లు ఆమె వివరించారు. చెత్త లిఫ్టింగ్‌లో ఏమాత్రం అశ్రద్ధ చూపినా కాంట్రాక్ట్‌ రద్దు చేస్తామన్నారు.

6 నుంచి బ్రహ్మోత్సవాలు

దిల్‌సుఖ్‌నగర్‌: శ్రీరామకృష్ణాపురంలో కుర్తాళం సిద్ధేశ్వరి పీఠ విభాగ ఆదిపరాశక్తి ప్రత్యంగిరా దేవి మందిరం వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 6 నుంచి 8 వరకు జరుగుతాయని ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్‌ తెలిపారు. ఆలయ బ్రహ్మోత్సవాల కరపత్రాలను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. ప్రతిరోజూ ఉదయం అమ్మవారికి విశేష ద్రవ్యాలతో అభిషేకం, యాగ మండప దేవత హోమాలు, సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజూ సాయంత్రం అమ్మవారికి విశేష అలంకరణ, భక్తి సంగీతం, రాత్రి మహా నక్షత్ర హారతులు ఉంటాయన్నారు. బ్రహ్మోత్సవాలలో మూడవ రోజు బుధవారం ఉదయం అమ్మవారికి అన్నాభిషేకం, సాయంత్రం పల్లకి సేవ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పరిష్కరించమంటే పెంచితే ఎలా?



సరూర్‌నగర్‌ చెరువు ముంపు ప్రాంతంలో కొనసాగుతున్న బాక్స్‌ డ్రెయిన్‌ పనులు



అధికారులు, స్థానికులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బలాల

- బాక్స్‌ డ్రెయిన్‌ను తక్కువ సామర్థ్యం ఉన్న నాలాకు అనుసంధానించే ప్రయత్నం
- ముంపు సమస్య పెరుగుతుందని పనులను అడ్డుకున్న స్థానికులు
- సర్వే చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే బలాల

సైదాబాద్‌: సరూర్‌నగర్‌ చెరువు పరిసర ప్రాంతాల్లో ముంపు సమస్య పరిష్కారం కోసం నిర్మిస్తున్న బాక్స్‌ డ్రెయిన్‌ పనుల్లో గందరగోళం చోటుచేసుకుంది. కిలో మీటర్‌ పొడవున నిర్మించిన బాక్స్‌ డ్రెయిన్‌ను తక్కువ సామర్థ్యం ఉన్న సాధారణ నాలాకు అనుసంధానం చేయడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం సరూర్‌నగర్‌ చెరువు కట్ట నుంచి సైదాబాద్‌ వైపు వెళ్లే రహదారిని మూసివేసి ఎస్‌ఎన్‌డీపీ అధికారులు చేపట్టిన నిర్మాణ పనులను స్థానికులు అడ్డుకున్నారు. బీఆర్‌ఎస్‌, బీజేపీ నాయకులు వారికి మద్దతు తెలిపారు. అధికారులు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్‌ బలాల అక్కడికి చేరుకొని గతంలో నిర్మించిన వరద నీటి కాలువపై సర్వే చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించడంతో వివాదం సద్దుమణిగింది.

ఏడాది నుంచి సాగుతున్న పనులు..

భారీ వర్షాలు కురిసిన సమయంలో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటితో సరూర్‌నగర్‌ చెరువు పరిసర ప్రాంతాలు ముంపు బారిన పడుతున్నాయి. సమస్య పరిష్కారం కోసం రూ.8.7 కోట్ల ఎస్‌ఎన్‌డీపీ నిధులతో 2022 జనవరి 28న ఐఎస్‌సదన్‌ డివిజన్‌ సింగరేణి కాలనీలోని బతుకమ్మ కుంట వద్ద 1210 మీటర్లు పొడవు, రెండున్నర మీటర్ల వెడల్పు, రెండు మీటర్ల లోతుతో ఆర్‌సీసీతో చేపట్టే బాక్స్‌డ్రెయిన్‌ నిర్మాణ పనులను అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. 2022 వర్షాకాలానికి ముందే పూర్తి చేయాల్సిన పనులు అధికారుల సమన్వయలోపంతో ఇప్పటికీ పూర్తి కాలేదు. ప్రస్తుతం గోల్డేజ్‌హోం లేన్‌ నుంచి శంకేశ్వరబజార్‌ చౌరస్తా మీదుగా మసీదు వెనుక ఉన్న నాలాకు అనుసంధానం చేసే పనులు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం సరూర్‌నగర్‌ చెరువు కట్ట నుంచి సైదాబాద్‌ వైపు వెళ్లే రహదారిని మూసివేసి పనులు చేపట్టారు.

అనుసంధానమే సమస్య..

శంకేశ్వరబజార్‌ చౌరస్తాలోని మసీదు వెనకున్న నాలా నిన్నపాటి వర్షాలకే నిండిపోతుంది. ఇక భారీ వర్షాలు కురిసినప్పుడు నాలా విపరీతంగా పొంగి సమీపంలో నివసించే పేదల ఇళ్లను ముంచెత్తుతుంది. అలాంటి తక్కువ సామర్థ్యం ఉన్న నాలాకు బాక్స్‌ డ్రెయిన్‌ను ఎలా అనుసంధానిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సమస్య పరిష్కరించకుండా పెద్దది చేసే ప్రయత్నం చేయడం సరికాదంటూ పనులను అడ్డుకున్నారు.

పరిష్కారం చూపుతాం: ఎమ్మెల్యే బలాల

బాక్స్‌ డ్రెయిన్‌ పనులను స్థానికులు అడ్డుకున్న విషయం తెలుసుకున్న మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్‌ బలాల అక్కడికి చేరుకున్నారు. స్థానికులు, అధికారులతో చర్చించారు. అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపుతామని ఆయన పేర్కొన్నారు. శంకేశ్వరబజార్‌లో గతంలో నిర్మించిన వరద నీటి కాలువపై సర్వే చేయించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకోవాలి



సైదాబాద్‌ డివిజన్‌ పరిధిలో ముంపు సమస్య పరిష్కారానికి అందరూ సహకరించాలి. శంకేశ్వర బజార్‌ చౌరస్తా సమీపంలోని బస్తీలు, కాలనీల ప్రజలు భారీ వర్షాల సమయంలో ముంపు సమస్య ఎదుర్కొంటున్నారు. బాక్స్‌ డ్రెయిన్‌ నిర్మాణంతో ఎవరికీ ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిర్ణయం తీసుకోవాలి. సైదాబాద్‌లో ముంపు సమస్య శాశ్వత పరిష్కారం కోసం ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

– సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి, మాజీ కార్పొరేటర్‌

వరద నీటి కాలువతో అనుసంధానించాలి



అభివృద్ధి పనులు ప్రజల సమస్యలు పరిష్కరించేలా ఉండాలి. బాక్స్‌ డ్రెయిన్‌ను శంకేశ్వరబజార్‌ నాలాకు అనుసంధానిస్తే ముంపు సమస్య మరింత పెరుగుతుంది. ఇక్కడ గతంలోనే వరద నీటి కాలువ నిర్మించారు. దానిలో అడ్డంకులు తొలిగించి బాక్స్‌ డ్రెయిన్‌ను అనుసంధానిస్తే ముంపు సమస్య పరిష్కారమవుతుంది.

– కొత్తకాపు రవీందర్‌రెడ్డి, బీజేపీ సీనియర్‌ నాయకుడు

పనుల్లో నాణ్యత లోపిస్తే సహించం



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్‌ పరిధిలోని కాలనీల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని కార్పొరేటర్‌ వంగా మధుసూదన్‌రెడ్డి కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. బుధవారం ఆయన డివిజన్‌ పరిధిలోని రెడ్డి కాలనీలో రూ.30 లక్షల నిధులతో ప్రారంభించిన సీసీ రోడ్డు పనులను సర్కిల్‌ అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. తమ ఇంటి ముందు ఏర్పాటు చేసుకున్న ర్యాంపులు, మెట్లను తొలగించి సీసీ రోడ్డు ఏర్పాటుకు స్థానికులు సహకరించాలని కోరారు. సర్కిల్‌ అధికారులు ఎప్పటికప్పుడు పనులను పరిశీలిస్తూ నాణ్యత లోపం లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్కిల్‌ ఏఈ సురేష్‌, సిబ్బంది రాజు, నాయకులు పాశం శ్రీశైలం, విజేశ్వర రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కుంభం రఘుమారెడ్డి, శంకర్‌రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, నర్సింహారెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటరెడ్డి, అంజయ్యగౌడ్‌, పెంటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తాం



వేడుకల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్‌: వీరన్నగుట్టపై ఉన్న ప్రాచీన శివాలయం వద్ద మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని మన్సూరాబాద్‌ కార్పొరేటర్‌ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం ఆయన వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వీరన్నగుట్టపై ఉన్న శివాలయంతో పాటు రామాలయం, లక్ష్మీనర్సింహస్వామి ఆలయాలను అభివృద్ధి చేస్తామన్నారు.

మలక్‌పేట సమగ్రాభివృద్ధికి కృషి



వాకింగ్‌ ట్రాక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్‌ అరుణ

సైదాబాద్‌: మలక్‌పేట నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే అహ్మద్‌ బలాల పేర్కొన్నారు. బుధవారం ఆయన కార్పొరేటర్‌ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డితో కలిసి సైదాబాద్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. జీఏ కాలనీలో నిర్మించిన సీసీ రహదారి, పద్మావతి కల్యాణ మండపంలో నిర్మించిన వాకింగ్‌ ట్రాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్‌లలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. మహిళాభవన్‌లో శిక్షణ పొందుతున్న మహిళలకు కుట్టు మెషిన్‌లు అందజేయాలని, మూడుగుళ్ల చౌరస్తాలో రీడింగ్‌రూమ్‌ ఏర్పాటు చేయాలని కార్పొరేటర్‌ ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో మురళి, రామకృష్ణరాజు, కృష్ణమురళి, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌ టోర్నమెంట్‌ విజేతలకు బహుమతులు



విజేతలతో శ్రీనివాస్‌గుప్తా తదితరులు

మలక్‌పేట: రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్‌ ఓపెన్‌ బ్యాడ్మింటన్‌ టోర్నమెంట్‌ జనవరి 29 నుంచి ఫిబ్రవరి 1 వరకు నిర్వహించారు. 13 ఏళ్ల లోపు బాలురు, బాలికలు సింగిల్స్‌, డబుల్స్‌.. 15 ఏళ్ల లోపు బాలురు, బాలికలు సింగిల్స్‌, డబుల్స్‌, మిక్స్‌డ్‌ డబుల్స్‌ మ్యాచ్‌లకు పోటీలు జరిగాయి. టోర్నమెంట్‌ ముగింపు కార్యక్రమానికి తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ ఉప్పల శ్రీనివాస్‌ గుప్తా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో ఆసక్తి కలిగిన యువతకు ప్రోత్సాహం అందించాలన్నారు.

రెండు చోట్ల ఓటు ఉంటే ఒకటి తొలగిస్తాం

చాదర్‌ఘాట్‌: మలక్‌పేట సర్కిల్‌–6 పరిధిలో నేటి నుంచి సిమిలర్‌ ఎంట్రీ ఫొటోల వెరిఫికేషన్‌ ప్రారంభిస్తున్నట్లు డీసీ జయంత్‌ తెలిపారు. బుధవారం ఆయన సర్కిల్‌ కార్యాలయంలో మాట్లాడుతూ.. వేరే జిల్లాలో ఓటు ఉండి మలక్‌పేట నియోజకవర్గంలోనూ ఉన్న వారు సుమారు ఇరవై వేల మంది ఉన్నారన్నారు. తమ సిబ్బంది వారి వద్దకు వెళ్లి జిల్లాల్లో ఉన్న ఓటు వివరాలు సేకరించి ఒకదానిని తొలగిస్తామన్నారు. ఆధార్‌ కార్డుతో అనుసంధానం చేసుకోకపోతే రెండు చోట్లా ఓటును తొలగించనున్నట్లు ఆయన తెలిపారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

మలక్‌పేట: మూసారంబాగ్‌ ఎస్‌బీఐ ఆఫీసర్స్‌ కాలనీ కంచికామకోటి పీఠం కాంచీపురం వెంకటేశ్వర స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు ముగిశాయి. బుధవారం నాగరాజు నాగదేవత వద్ద ఈశ్వరునికి సుబ్రహ్మణ్యేశ్వరునికి లఘు న్యాస పూర్వక రుద్రాభిషేకం, పూర్ణాహుతి, మహాకుంబాభిషేకం, సుదర్శన చక్ర స్నానం, అవభృథోత్సవం, ఊంజల్‌ సేవ నిర్వహించారు. కమిటీ చైర్మన్‌ ఉన్నవ పూర్ణచందర్‌రావు, శారద దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వీవీఎస్‌ హరీష్‌, వైస్‌ చైర్మన్‌ విశ్వేశ్వర్‌రావు, కార్యదర్శి కుమార్‌ పురోహిత్‌, ప్రధాన అర్చకుడు జ్వాల నర్సింహాచార్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

సైదాబాద్‌: విద్యార్థులు ట్రాఫిక్‌ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని బేగంపేట ట్రాఫిక్‌ ట్రెనింగ్‌ ఇనిస్టిట్యూట్‌ ఏసీపీ శంకర్‌రాజు సూచించారు. బుధవారం సైదాబాద్‌లోని మాతృశ్రీ ఇంజనీరింగ్‌ కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్‌, సైబర్‌ క్రైమ్స్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. వాహనదారులందరూ ట్రాఫిక్‌ సిబ్బంది ఆదేశాలను పాటిస్తూ వారికి సహకరిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌ ధరించి ఇతరుల వాహనాలకు ఆటంకం కలిగించకుండా డ్రైవింగ్‌ చేయాలన్నారు. సైబర్‌ క్రైమ్స్‌ పట్ల అప్రమత్తంగా ఉండాలని, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఆయన విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సైదాబాద్‌ ఎస్‌ఐ శివాజీ, సిబ్బంది ఎస్‌.వెంకటప్రసాద్‌, ఖాదీర్‌ పాల్గొన్నారు.

విజయకుమార్‌కు జీనియస్‌ బుక్‌ ఆఫ్‌ వరల్డ్‌ రికార్డ్స్‌లో చోటు

వనస్థలిపురం: తెలంగాణ హిందీ కవి, వనస్థలిపురానికి చెందిన గుండాల విజయకుమార్‌ జీనియస్‌ బుక్‌ ఆఫ్‌ వరల్డ్‌ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. హిందీ సాహిత్యంలో ఆయనకు ఈ అవార్డు ప్రదానం చేశారు. విజయకుమార్‌ హిందీ సాహిత్యంలో 3 స్వీయ పుస్తకాలు, 25 సహ పుస్తకాలు రచించారు. ఆయన జాతీయ స్థాయిలో 50కి పైగా అవార్డులు పొందారు. ఈ నెల 5న ఢిల్లీలో అవార్డు ప్రదానం చేయనున్నారు.

సొంత భవనంలోకి బధిరుల పాఠశాల

చాదర్‌ఘాట్‌: ఆస్మాన్‌ఘడ్‌లోని మూగ బధిరుల రెసిడెన్షియల్‌ పాఠశాలను మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమ భవన్‌ ప్రాంగణంలోకి మారుస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్‌ అరుణ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. ఆస్మాన్‌ఘడ్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న పాఠశాలను పరిశీలించి సొంత భవనంలోకి మార్చాలని డైరెక్టర్‌ చెప్పారన్నారు. డైనింగ్‌ హాల్‌, వంట గది నిర్మాణం కోసం రూ.కోటి యాభై లక్షలు కేటాయించినట్లు తెలిపారు. మార్చిలోపు పాఠశాలను తరలిస్తామన్నారు.

గో ఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



మంత్రి తలసానికి వినతిపత్రం అందజేస్తున్న గో సేవా ఫౌండేషన్‌ ప్రతినిధులు

సైదాబాద్‌: గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించేందుకు తెలంగాణ ప్రభుత్వం సహకరించాలని అఖిల భారత గో సేవా ఫౌండేషన్‌ అధ్యక్షుడు బాలకృష్ణ కోరారు. ఈ మేరకు ఆయన మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గో ఆధారిత వ్యవసాయాన్ని, గో ఉత్పత్తులను ప్రోత్సహించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం గోవుల కోసం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను అన్ని గోశాలల నిర్వాహకులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో చంద్రస్వామి, లోకేష్‌యాదవ్‌, మల్లేష్‌, రాములుగౌడ్‌, ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

11న సరూర్‌నగర్‌ స్టేడియంలో మెగా జాబ్‌ మేళా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మల్లేశ్‌

ఎల్‌బీనగర్‌: సరూర్‌నగర్‌ స్టేడియంలో 120 కంపెనీలతో ఈ నెల 11న నిర్వహించే మెగా జాబ్‌ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌బీనగర్‌ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సూచించారు. బుధవారం తన కార్యాలయంలో జాబ్‌ మేళా పోస్టర్‌ను ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశంతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. జాబ్‌ మేళాలో 120 (టెక్నికల్‌, నాన్‌ టెక్నికల్‌, ఐటీ, నాన్‌ ఐటీ) కంపెనీల ప్రతినిధులు హాజరై 10,000 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. 7వ తరగతి నుంచి పీజీ వరకు చదివిన నిరుద్యోగ యువతతో పాటు దివ్యాంగులు, మూగ, చెవిటి, అంధులు సైతం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 7286008234, 9505437112, 8247768371 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు అనంతుల రాజిరెడ్డి, దేరింగుల కృష్ణ, రామ్‌ కల్యాణ్‌, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌, శేషగిరిరావు, నరేందర్‌గౌడ్‌, రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

‘హామీల అమలులో సీఎం కేసీఆర్‌ విఫలం’



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లయ్య

హస్తినాపురం: అర్హులందరికీ ఇళ్లు, స్థలాలను కేటాయించాలని సీఐటీయూ ఎల్‌బీనగర్‌ సర్కిల్‌ కన్వీనర్‌ ఆలేటి ఎల్లయ్య అన్నారు. బుధవారం కర్మన్‌ఘాట్‌లో జరిగిన తెలంగాణ ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎల్లయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. దళితులకు మూడెకరాల భూమి, డబుల్‌ బెడ్‌రూం ఇళ్లు, ఇంటి స్థలం ఉన్న వారికి రూ.3 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. దళితబంధు, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి పేరుతో ప్రజలను మోసం చేసిన కేసీఆర్‌కు ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెప్తారని ఆయన అన్నారు. కార్యక్రమంలో చిప్పలపల్లి అంజయ్య, నల్ల చంద్రమ్మ, అంజమ్మ, పద్మ, యాదమ్మ, జాన్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉనికి కోసమే కాంగ్రెస్‌ నేతల విమర్శలు



నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన బీఆర్‌ఎస్‌ నేతలు

చైతన్యపురి: రాష్ట్రంలో కాంగ్రెస్‌ పార్టీ ఉనికి కాపాడుకునేందుకే ఆ పార్టీ నేతలు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని బీఆర్‌ఎస్‌ పార్టీ మాజీ కార్పొరేటర్లు ఆరోపించారు. కొత్తపేటలోని టిమ్స్‌ నిర్మాణ ప్రక్రియ గురించి అవగాహన లేకపోవడంతోనే కాంగ్రెస్‌ నేతలు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. బుధవారం టిమ్స్‌ నిర్మాణ స్థలంలో మాజీ కార్పొరేటర్లు భవాని ప్రవీణ్‌కుమార్‌, జీవి సాగర్‌రెడ్డి, సామ తిరుమల్‌రెడ్డి మాట్లాడారు. ఏప్రిల్‌లో సీఎం శంకుస్థాపన చేసిన తర్వాత వివిధ శాఖల నుంచి అనుమతులు తీసుకుంటూనే టెండర్‌ ప్రక్రియను పూర్తి చేశారని వారన్నారు. త్వరలో సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం ప్రారంభమయ్యే నేపథ్యంలో కాంగ్రెస్‌ నేతలు ఆందోళన చేయడం సిగ్గుచేటని విమర్శించారు.

డ్రైనేజీ పైపులైన్‌కు నిధులు మంజూరు చేయండి



దానకిషోర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్‌ పవన్‌కుమార్‌

నాగోలు: కొత్తపేట డివిజన్‌ పరిధిలోని కాలనీల్లో డ్రైనేజీ లైన్‌ అస్తవ్యస్తంగా ఉందని, నూతన డ్రైనేజీ పైప్‌లైన్‌ కోసం నిధులు మంజూరు చేయాలని కొత్తపేట కార్పొరేటర్‌ నాయికోటి పవన్‌కుమార్‌ బుధవారం జలమండలి ఎండీ దానకిషోర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పవన్‌ కుమార్‌ మాట్లాడుతూ.. డివిజన్‌ పరిధిలోని భరత్‌ నగర్‌ ఫేజ్‌–1 బస్తీలోని డ్రైనేజీ లైన్‌ ధ్వంసం కావడంతో నిరంతరం మురుగు పొంగుతుందన్నారు. ఎండీ దానకిషోర్‌ సానుకూలంగా స్పందించి నూతన డ్రైనేజీ లైన్‌ కోసం రూ.51 లక్షలు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు అనుకూలమైన వేళల్లో బస్సులు నడపండి



బస్సులో విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్‌

లింగోజిగూడ: విద్యార్థులు, ఉద్యోగుల సమయానికి అనుగుణంగా సరూర్‌నగర్‌ పోస్ట్‌ ఆఫీస్‌ నుంచి బస్‌ సౌకర్యం కల్పించాలని లింగోజిగూడ కార్పొరేటర్‌ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ఆర్టీసీ అధికారులను కోరారు. విద్యార్థుల ఫిర్యాదు మేరకు బస్‌ సౌకర్యం గురించి తెలుసుకునేందుకు బుధవారం ఉదయం 8 గంటల నుంచి 9 వరకు బస్‌స్టాప్‌ వద్ద ఉండి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాలేజీ, ఆఫీస్‌కి వెళ్లేవారు సరైన సమయంలో బస్‌లు లేకపోవడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందన్నారు. డిపో మేనేజర్‌ను కలిసి సమస్యను వివరించామని, త్వరలో అదనపు బస్సులు వేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. నాగోల్‌లోని ఆయన క్యాంప్‌ కార్యాలయంలో మోహన్‌నగర్‌, కొత్తపేట రెడీ టూ సర్వ్‌ ఫౌండేషన్‌ (లైఫ్‌ సర్వీసెస్‌) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5న ప్రారంభం కానున్న బ్లడ్‌ డొనేషన్‌ క్యాంప్‌ బ్రోచర్‌ను బుధవారం ఆవిష్కరించారు. యువత అధిక సంఖ్యలో హాజరై రక్తదానం చేయాలని ఆయన సూచించారు.